క్లుప్తంగా

కూలిన ఇళ్ల వివరాల సేకరణ



ఇళ్ల వివరాలను సేకరిస్తున్న ఆర్ఐ శరణప్ప

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో కూలిన ఇళ్ల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఆదివారం పలు కాలనీల్లో పర్యటించిన ఆర్ఐ శరణప్ప సిబ్బందితో కలిసి కూలిన ఇళ్ల వివరాలను నమోదు చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణాలు నిలుపుదాం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): రక్తదానం చేసి ప్రాణాలు నిలుపుదామని ఎంపీపీ మాణిక్యరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చంద్లాపూర్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ జన్మదినం సందర్భంగా ఆదివారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. మొక్కలు నాటి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. 100 యూనిట్ల రక్తాన్ని సేకరించి సిద్దిపేట బ్లడ్ బ్యాంకుకు పంపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సర్పంచ్ చంద్రకళ రవి, ఎంపీటీసీ దుర్గారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, ఏఎంసీ చైర్మన్ వనిత రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి



రోడ్డును పరిశీలిస్తున్న యాదగిరి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని ఉప్పరొనిగడ్డ వల్లంపట్ల వెళ్లే రహదారి వర్షాలకు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయని వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గొర్రెల, మేకల పెంపకదారుల కోఆపరేటివ్ సొసైటీ జిల్లా డైరెక్టర్ ఆలేటి యాదగిరి కోరారు. ఆదివారం దెబ్బతిన్న రోడ్డును పరిశీలించి మాట్లాడారు. జిల్లా అధికారులకు అనేకమార్లు దరఖాస్తు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆయన వెంట నాయకులు సురేష్, రజినికాంత్, ఉన్నారు.

గడ్డిమందు పిచికారీ



గడ్డిమందు పిచికారీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి

తొగుట(దుబ్బాక): జీపీ కార్మికులు సమ్మె బాట పట్టడంతో పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి కార్మికుడి అవతారమెత్తాడు. మండలంలోని గుడికందుల వీధుల్లో ఆదివారం గడ్డి మందు పిచికారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొనకుండా చర్యలు చేపట్టామని వివరించారు.

కుంగిన రోడ్డు



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల కూటిగల్ ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు 2 మీటర్ల వరకు కుంగింది. దీంతో మద్దూరు హుస్నాబాద్ ప్రధాన రహదారిపై వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. త్వరగా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

చినుకుపడితే అంతే..

తోటపల్లి హరీశ్‌రావు కాలనీ జలమయం



వరద నీటితో నిండిన రోడ్డు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి హరీశ్‌రావు కాలనీ ప్రజలు ఏటా వరద నీటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిలవడంతో నడవడానికి సైతం ఇబ్బంది పడుతున్నారు. కాలనీలోనే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు సుమారు 50 నివాస గృహాలు ఉన్నాయి. తోటపల్లి నుంచే కాకుండా సమీప పొలాల నుంచి వరద నీరు రావడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సుమారు రెండేళ్ల క్రితం రూ. 12 లక్షలతో డ్రైనేజీని నిర్మించి ఎర్రగుంటకు వరద నీటిని తరలించగా సమస్య తాత్కాలికంగా పరిష్కారం అయింది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఒక ఇల్లు పాక్షికంగా ధ్వంసం కాగా మరో రెండు ఇళ్లలోకి వరద నీరు చేరి సామగ్రి పూర్తిగా ధ్వంసమైంది. మరికొన్ని ఇండ్లు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి హరీశ్‌రావు స్పందించి నిధులు మంజూరు చేసి తమ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

మంత్రికి వివరించాం



హరీశ్‌రావు కాలనీ లోతట్టులో ఉంది. రోడ్డు ఎత్తు పెంచితే సమస్య పరిష్కారం అవుతుంది. నూతనంగా డ్రైనేజీ నిర్మించి ఎర్రగుంటకు కలపాలి. మంత్రి హరీశ్‌రావుకు సమస్యను వివరించాం. త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

– నర్సింగరావు, తోటపల్లి సర్పంచ్

ఇబ్బంది పడుతున్నాం



ప్రతి వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. నీరు నిలవడంతో పాక్షికంగా మా ఇల్లు కూలింది. వెంటనే సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలి.

– రాజన్న, తోటపల్లి

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పూల కుండీలో నీటిని తొలగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం పది గంటల పది నిమిషాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత తన ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో పూల కుండీలు, నిలువ ఉన్న నీటిని, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ ప్రజలందరూ తమ ఇంటితో పాటు ఇంటి పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన నీటిని శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం కేవలం 10 నిమిషాల పాటు ఇంటి శుభ్రతకు సమయం కేటాయిస్తే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆడబిడ్డలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆడబిడ్డలకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ దవాఖానాలో ఉచితంగా టిఫా స్కానింగ్, కడుపులో బిడ్డ బలోపేతం, గర్భిణులకు రక్తహీనత తగ్గేందుకు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తున్నామని వివరించారు.

గుర్రపు డెక్కను తొలగించాలి

కోమటి చెరువుకు ఉన్న కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తను వెంటనే తొలగించాలని మంత్రి హరీశ్‌రావు మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆదివారం బావిస్ ఖాన పూల్‌ను పరిశీలించారు. వరద కాలువతో ప్రభావిత ప్రాంతాలకు ఇబ్బంది తలెత్తకుండా పదేళ్ల క్రితమే కోమటి చెరువు కాలువను పునరుద్ధరణ చేశామని వివరించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాలకు చెందిన గోపినాథ్ రెడ్డి ఆదివారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు బీజేవైఎం మండల కార్యవర్గ సభ్యులు కంతుల లక్ష్మణ్, బీజేపీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ గ్యార రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వల్లపు శ్రీనివాస్, వల్లెపు యాదగిరితో పాటు 20 మంది వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు.

భూపాల్‌రెడ్డికి పరామర్శ



భూపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోదూరి భూపాల్‌రెడ్డి తండ్రి యాదగిరిరెడ్డి (83) శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్వహించిన అంత్యక్రియలకు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు లింగారెడ్డి, కొండపోచమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్ పాష, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కర్ణాకర్‌గౌడ్, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాల్‌రెడ్డి ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరై బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'ఆత్మజ్ఞానం కలవారే హిందువులు'

గజ్వేల్‌రూరల్: ఆత్మజ్ఞానం కలవారే హిందువులని.. ప్రపంచ జ్ఞానం కలవారిని ఇంగిత జ్ఞానం కలవారని పూర్వం పేర్కొనేవారని త్రైత సిద్ధాంతం ఇందూ జ్ఞాన వేదిక-ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలతో రిమ్మనగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలు చదివి, స్వామివారి ప్రసంగాలు వింటూ ఆత్మజ్ఞానాన్ని తెలుసుకొని దేశానికి పూర్వ వైభవం తేవాలనే ఉద్దేశంతో ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మన్ కీ బాత్ వీక్షణ



హుస్నాబాద్: పట్టణంలో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ 'మన్ కీ బాత్'ను శక్తి కేంద్ర ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జి పోలోజు రాజేందర్ చారి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, నాయకులు బొడిగే వెంకటేష్, మధు, గంగిశెట్టి గాంధీ, విద్యాసాగర్, రాంప్రసాద్, పాల్గొన్నారు.



గుంతలమయంగా రోడ్డు

అడుగుకో గుంత.. తీరని చింత

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ నుంచి కోమటిబండ వెళ్లే రోడ్డుపై పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షం నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. పాలకుల నిర్లక్ష్యంతోనే తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేటకమాన్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యతని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవెర్గు రాజనర్సు అన్నారు. సిద్దిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లతో కలిసి ప్రజలకు మొక్కలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ సిద్దిపేటలో ప్రారంభించిన గొప్ప కార్యక్రమమే నేడు రాష్ట్రంలో అమలవుతున్న హరితహారం అని అన్నారు. మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేట పట్టణం నలుమూలలు చెట్లతో విస్తరించిందన్నారు. సిద్దిపేట పట్టణం 22వ వార్డులో మొక్కల పంపిణీ చేస్తున్న క్రమంలో బీహార్ కూలీలు గుట్కా వేసుకొని పరిసరాల్లో ఉమ్మివేయడం గమనించిన రాజనర్సు వారిని పిలిచి మందలించారు. గుట్కా తినమని వారితో ప్రమాణం చేయించారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి చేయండి



రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

దుబ్బాకరూరల్: మండలంలోని రఘోత్తంపల్లి, ఆకారం మీదుగా వెళ్లే రోడ్డు మార్గంలో కల్వర్టు నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. ఆదివారం సర్పంచ్ రెడ్డి దేవిరెడ్డి గ్రామస్తులతో కలిసి కల్వర్టును పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కల్వర్టును అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరారు.

కోహెడకు అంబులెన్స్ కేటాయించండి



ధర్నా నిర్వహిస్తున్న యూత్ సభ్యులు

కోహెడ(హుస్నాబాద్): కోహెడకు అంబులెన్స్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కోహెడ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 25వ తేదీన మంత్రి హరీశ్‌రావు కోహెడకు అంబులెన్స్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐదు నెలలు గడిచిన హామీ నెరవేరలేదని వాపోయారు.

అ'పూర్వ'సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దుబ్బాకటౌన్: దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 25 ఏళ్ల క్రితం (1996- 97)లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈసందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చీకోడ్, గంభీర్‌పూర్ సర్పంచ్‌లు తాడ శ్రీనివాస్, కరికె భాస్కర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పర్స కృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థికసాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి మధిర వడ్డెర కాలనీలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న వడ్డె రవి కుటుంబానికి అండగా ఉంటామని పెద్ద గ్రామ సేవా కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 21,700 ఆర్థిక సాయం అందజేశారు. కుమారైల చదువుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనకయ్య, మధుసూదన్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్, ఎల్లం పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని మోతెలో సీఎంఆర్‌ఎఫ్ కింద దుంపగడ్డ స్వామి, దావత్ లావణ్యలకు మంజూరైన చెక్కులను ఆదివారం సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు చంద్రం, కమ్మరి రవి, ఎల్లారెడ్డి, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ పండ్ల పంపిణీ



దుబ్బాక: తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దుబ్బాక పట్టణంలోని వంద పడకల ఆస్పత్రిలో గర్భిణులకు, రోగులకు ఆదివారం టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఇస్తారిగల్ల చరణ్‌తేజ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు స్వామి, గణేష్, రాజేందర్, నాగరాజు, చంద్రం, వెంకటచారి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ భగవన్నామ సంకీర్తన

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ఆకునూరు రుద్రేశ్వర ఆలయంలో అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం నామ సంకీర్తనాచార్య కొడకండ్ల రాధాకృష్ణ శర్మ భగవన్నామ సంకీర్తన ఆలపించారు.

◆ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

బెజ్జంకి(సిద్దిపేట): సోషల్ మీడియాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానకొండూరు ఇంచార్జ్ సత్యనారాయణ సూచించారు. బెజ్జంకిలో మానకొండూరు బ్లాక్-2 మండలాల సోషల్ మీడియా సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సోషల్ మీడియా మండల ఇంచార్జ్‌లుగా చందు, సంగం రాజేందర్, మల్లారెడ్డిని నియమించారు.

◆ నేడు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ రాక

కోహెడరూరల్(హుస్నాబాద్): కోహెడ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సోమవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ శంకుస్థాపన చేస్తారని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ బాధిత కుటుంబాలకు పరామర్శ

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లి, మాదారం, అనంతగిరిపల్లిలో ఇటీవల మృతిచెందిన గుంటుకు సత్తయ్య, పంపరి రాధిక, అంకని పాపమ్మ, నీరుడి ఎల్లమ్మ, దార సాయిలు కుటుంబ సభ్యులను ఆదివారం ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ లతారమేష్‌గౌడ్, సర్పంచ్‌లు లత శివరాములు, ముత్తి రామచంద్రం, బీఆర్‌ఎస్ నాయకులు నాగరాజు, లక్ష్మన్, నర్సింలు, దశరథం తదితరులు ఉన్నారు.

◆ బియ్యం అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అందె గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో సుక్క రామవ్వ మల్లయ్య మృతి చెందడంతో అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలు గాలయ్య, సుభద్రలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్దెల రాజేష్ ఆదివారం పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందించారు.

◆ కరపత్రాల ఆవిష్కరణ



హుస్నాబాద్: పట్టణంలోని ఆగస్టు 1న నిర్వహించే నియోజకవర్గ బీసీ రాజకీయ సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు వెల్దండి సంతోష్, పట్టణ అధ్యక్షుడు చొక్కాచారి, నాయకులు అనంతస్వామి, రాంప్రసాద్, పోలు రవీందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.